

తిరుమల తరహాలో..
యాదాద్రిలో తిరుమల తరహాలో వసతులు కల్పిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. - 8లో



దొంగల భయంతో..
పీఎస్ఆర్ టౌన్‌షిప్‌లో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ఇళ్ల ముందు చెట్లను నరికివేస్తున్నారు. - 8లో

వాతావరణం
గరిష్ఠం / కనిష్ఠం
33 / 26°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట) : గ్రూప్ –1 సర్వీస్ మెయిన్స్ పరీక్షకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థుల కోసం తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి కె.జగదీశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 22వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. అర్హులైన మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

పెన్‌పహాడ్ : సీజనల్ వ్యాధుల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ సూచించారు. బుధవారం పెన్‌పహాడ్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీల్లో అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో మొక్కలను నాటి వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి. ఈ సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీఓ బాణాల శ్రీనివాస్, ఏపీఓ రవి, ఈసీ మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రూపు–1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

నల్లగొండ టౌన్ : తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉద్యోగ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు గ్రూపు–1 మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీజీ బీసీ ఉపాధి నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం సంచాలకుడు కె.విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు 11 నుంచి 19వ తేదీ వరకు ఀజ ఛిట్ట ఛీఛిజీటఛ్తి ్ర.ఛిజజ.జౌ్ఠి.జీ ఽ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులకు హైదరాబాద్, ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్‌లో 22వ తేదీ నుంచి 75 రోజుల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. కోచింగ్ సమయంలో నెలకు రూ.5 వేల స్టైఫండ్ ఇస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 08682–220007 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న పాశికంటి లక్ష్మీనర్సయ్య

మోత్కూరు: రాష్ట్రంలో చేనేత, పవర్ లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాశికంటి లక్ష్మీనర్సయ్య, ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ అన్నారు. బుధవారం మోత్కూరు మండల కేంద్రంలోని పద్మశాలి కాలనీలో చేనేత కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేనేత, పవర్ లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, మగ్గం నడవాలి, నేతన్న బతకాలి, నేతన్నకు చేయూతనిద్దాం అనే నినాదంతో ఈ నెల 7న సిరిసిల్లలో పోరు యాత్ర ప్రారంభించామని, ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సభకు చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చేనేత జౌళి శాఖ రాష్ట్ర కమిషనర్ శైలజరామయ్య, కార్మిక నాయకులను ఆహ్వానించి చర్చించినట్లు చెప్పారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి ప్రస్తుత పథకాలు అమలు చేస్తామని, చెల్లించాల్సిన బకాయిలు విడతల వారీగా చెల్లిస్తామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్మికులకు పని కల్పించేందుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని, సహకార ఎన్నికలతో పాటు అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నేతన్న పోరు బాటను తాత్కాలికంగా వాయిదా వేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు, పసునూరు యాదయ్య, ఏలూరు మత్స్యగిరి పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాల్సిందే..

కలెక్టరేట్ ఎదుట గురుకుల కళాశాల విద్యార్థినుల ధర్నా



బుధవారం రాత్రి 9 గంటలకు కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న విద్యార్థినుల ధర్నా

- సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 9.40గంటల వరకు కొనసాగిన నిరసన
- రాత్రి 10.48 గంటలకు విద్యార్థినులతో ముగిసిన కలెక్టర్ సమావేశం
- అంతకుముందు బాలెంల నుంచి కలెక్టరేట్ వరకు 15కి.మీ. మేర పాదయాత్ర

సూర్యాపేట మండలం బాలెంల గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శైలజను సస్పెండ్ చేయాల్సిందేనని ఆ కళాశాల విద్యార్థినులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చేవరకు కదిలేది లేదని మూడున్నర గంటలకుపైగా భీష్మించి కూర్చున్నారు. డీఎస్పీ నచ్చజెప్పడంతో ఆందోళన విరమించి కలెక్టర్ వద్దకు వెళ్లారు. విద్యార్థులతో కలెక్టర్ సమావేశమై సమస్యలన్నీ విని న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు కళాశాల నుంచి కలెక్టరేట్‌కు సుమారు 15కి.మీ. మేర పాదయాత్రగా చేరుకున్నారు.

– భానుపురి, సూర్యాపేట రూరల్

10లో

ఇళ్లు ఇస్తామని దగా

- ఒక్కొక్కరి నుంచి రూ.40వేల నుంచి రూ.70వేల వరకు వసూలు
- రద్దయిన గృహనిర్మాణ సంస్థ నుంచి మంజూరు పత్రాలు
- గతంలో గృహనిర్మాణ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన మోసగాడు
- మిర్యాలగూడ కేంద్రంగా నకిలీ బాగోతం
- లబోదిబోమంటున్న బాధితులు



పన్నెండేళ్ల క్రితం కోదాడలో గృహనిర్మాణశాఖలో పనిచేసిన ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అక్కడే ఐరన్ దుకాణంలో పని చేస్తున్న వ్యక్తితో పరిచయం పెంచుకున్నాడు. రెండేళ్ల క్రితం అతనికి ఫోన్ చేసి గృహనిర్మాణ శాఖ నుంచి కొత్త ఇల్లు మంజూరు చేయిస్తానని చెప్పాడు. దశలవారీగా అతడి నుంచి దాదాపు రూ.65 వేల వరకు ఫోన్‌పే చేయించుకున్నాడు. అతనికి ఇల్లు మంజూరైనట్లు రద్దయిన గృహనిర్మాణశాఖ నుంచి పత్రాలు కూడా పంపాడు. రెండేళ్లు దాటినా అదిగో ఇదిగో అంటూ తిప్పడంతో అనుమానం వచ్చి ఆరా తీశాడు. దీంతో అంతా మోసం అని తేలడంతో లబోదిబోమంటున్నాడు.

కోదాడ: ఇళ్లు మంజూరు చేయిస్తానని ఓ వ్యక్తి ప్రజలను దగా చేశారు. ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూలు చేయడమే కాకుండా వారికి రద్దయిన గృహనిర్మాణశాఖ పేరిట ఇళ్ల మంజూరు పత్రాలు సైతం పంపి బురిడీ కొట్టించాడు. కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో వంద మందికిపైగా ఇలా నకిలీ ఇళ్ల మంజూరు పత్రాలు పంపించినట్లు సమాచారం. మిర్యాలగూడ కేంద్రంగా ఈ నకిలీబాగోతం నడిపినట్లు తెలిసింది.

మోసం చేశాడు ఇలా..
గతంలో కోదాడ గృహనిర్మాణశాఖలో పనిచేసిన ఏఈ ప్రస్తుతం ఏపీలోని పిడుగురాళ్లలో పని చేస్తున్నారు. ఈయనకు దగ్గరిబంధువైన ఓ వ్యక్తి 2009 నుంచి 2012 వరకు కోదాడలోనే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేశాడు. ఆ సమయంలో తనకున్న పరిచయాలను ఉపయోగించుకొని మోసానికి తెర లేపాడు. అప్పట్లోనే అతడు మిర్యాలగూడలో నివాసం ఉంటూ కోదాడకు రాకపోకలు సాగించేవాడు . రాజధాని స్థాయిలో తనకు పలుకుబడి ఉందని ప్రభుత్వ ఇళ్లను మంజూరు చేయిస్తానని చెబుతూ వందల మంది నుంచి డబ్బులు వసూలు చేయడం మొదలు పెట్టాడు. ఒక్కొక్కరి నుంచి రూ.40వేల నుంచి రూ.70వేల వరకు వసూలు చేశాడు. తన ఫోన్ వాట్సాప్ డిస్‌ప్లే పిక్చర్ (డీపీ)గా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టుకోవడం గమనార్హం. ఆయన గృహనిర్మాణశాఖ నుంచి ఇళ్లు మంజూరైనట్లు, ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.40 లక్షలు బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయనున్నట్లు నకిలీ పత్రాలను వారికి పంపి డబ్బులు వసూలు చేయసాగాడు. వాస్తవానికి గృహనిర్మాణశాఖను గతంలోనే ప్రభుత్వం రద్దు చేసి రోడ్లుభవనాల శాఖలో విలీనం చేసింది. కానీ అతడు మాత్రం గృహనిర్మాణశాఖ పేరిట నకిలీ మంజూరు పత్రాలు సృష్టించి పంపిస్తూ దగా చేశాడు. ఇలా రెండు సంవత్సరాలుగా ఒకరికి తెలియకుండా మరొకరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు సమాచారం. ఇతని వలలో పడిమోసపోయినవారు సుమారు వంద మందికిపైగా ఉండొచ్చని సమాచారం.

బాధితుల ఎదురు చూపులు

సంవత్సరాలు గడిచినా ఇళ్లకు సంబంధించిన డబ్బులు రాక అనుమానం వచ్చిన బాధితులు నిలదీయడంతో ఇతను ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. పోలీసులకుగానీ, ఇతరులకు గానీ చెబితే అసలు డబ్బులే ఇవ్వనని బాధితులు కొందరిని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై పలువురు బాధితులు పిడుగురాళ్లలో గృహనిర్మాణ శాఖ ఏఈగా పని చేస్తున్న అతని బాబాయిని అడిగారు. అయితే తనకు సంబంధం లేదని, నష్టం జరిగితే కేసులు పెట్టుకోవాలని ఆ ఏఈ సూచించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ఘరానా మోసగాడు మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి తన మకాం హైదరాబాద్‌కు మార్చినట్లు తెలుస్తోంది. దీనిపై బాధితులంతా కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

పర్యాటక కేంద్రంగా సూర్యాపేట అభివృద్ధికి కృషి

- టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేట : పర్యాటక కేంద్రంగా సూర్యాపేట అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి సూర్యాపేటకు వచ్చిన ఆయనకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు చేసిన ప్రజాసేవకు గుర్తింపుగా సీఎం రేవంత్‌రెడ్డి తనను రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారని తెలిపారు. పర్యాటక శాఖ మంత్రి జూపూడి కృష్ణారావు సహకారంతో సూర్యాపేట సద్దల చెరువు, మూసీ నది అభివృద్ధికి నిధులు తీసుకొస్తానని చెప్పారు. ఉండ్రుగొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సహకారంతో సూర్యాపేట అభివృద్ధికి నిధులు తీసుకొస్తానని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో పార్టీ విజయం కోసం పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి రాజా, కౌన్సిలర్లు షఫీ ఉల్లా, వెలుగు వెంకన్న, నామా అరుణ, గట్టు శ్రీనివాస్, ముదిరెడ్డి రమణారెడ్డి, నిమ్మల వెంకన్న, జ్యోతి కరుణాకర్, రమేష్ నాయుడు, డాక్టర్ రామ్మూర్తి యాదవ్, ఫరూక్, తండు శ్రీనివాస్, సాజిద్, ధర్మా నాయక్, వల్దాస్ దేవేందర్, సైదిరెడ్డి పాల్గొన్నారు.

సంఘ వ్యతిరేక శక్తులపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



నూతనకల్‌లో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

నూతనకల్: సంఘ వ్యతిరేక శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశించారు. బుధవారం నూతనకల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. సమాజంలో సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా, అక్రమ దందాలు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణకు పోలీసు జాతా చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. ఆయన వెంట సూర్యాపేట డీఎస్పీ రవి, తుంగతుర్తి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ జె. సైదులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కు పాదం
తుంగతుర్తి : మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కు పాదం మోపాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. బుధవారం తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. నూతనంగా నిర్మితమవుతున్న పోలీస్ స్టేషన్ ను పరిశీలించి మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామన్నారు. పీడీఎస్ బియ్యం దందా చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవికుమార్ సీఐ శ్రీనివాస్ నాయక్, ఎస్ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.

689 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

సూర్యాపేటటౌన్ : జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి వారం రోజుల్లో 10 కేసులు నమోదు చేసి 689 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్ చేసినట్లు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో పీడీఎస్ బియ్యం దందా చేసే వారిపై, నిల్వ స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసు విచారణలో భాగంగా ఆంధ్రా ప్రాంతంలో కూడా దర్యాప్తు చేసి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కేసులో లోతైన దర్యాప్తు చేసి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడ్డ వారు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీడీఎస్ బియ్యం దందా చేస్తే పీడీ యాక్ట్ సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణలతో బుధవారం నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలకార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించారు. ఈకార్యక్రమంలో చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, నవీన్‌కుమార్, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు అంతంతే..

ఫస్ట్ ఇయర్‌లో మందకొడిగా సాగుతున్న ప్రవేశాల ప్రక్రియ

- జిల్లాలో ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు
- ఇప్పటి వరకు 850 మంది విద్యార్థులు చేరిక
- అత్యధికంగా ప్రైవేట్ కాలేజీల వైపే మొగ్గు



సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

సూర్యాపేటటౌన్ : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు అంతంత మాత్రంగానే అవుతున్నాయి. జూన్ 1వ తేదీ నుంచి కళాశాలలు పునఃప్రారంభమైనా జిల్లాలో అడ్మిషన్లు మందకొడిగా సాగుతున్నాయి. గతంలో విద్యార్థులతో కళకళలాడే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. జిల్లాలో ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. జనరల్‌తో పాటు ఒకేషనల్ కోర్సులున్నాయి. ఇప్పటి వరకు జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో కలిపి 850 మంది విద్యార్థులు చేరారు. కళాశాలల్లో అందించే విద్య, సౌకర్యాలపై అధ్యాపకులు ప్రచారం చేస్తున్నా తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపడం లేదు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయినవారిశాతం ఎక్కువ ఉండటం తెలిసిందే. దీంతో ఆర్థిక స్థోమత లేకున్నా పిల్లల భవిష్యత్ కోసం ప్రైవేట్ కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఇప్పటి వరకు 850 మంది చేరిక
జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొత్తం 2,800 మంది విద్యార్థులు ఆయా గ్రూపుల్లో చేరారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 850 మంది మాత్రమే అడ్మిషన్ తీసుకున్నారు.

ఇంటర్ అధికారులు దృష్టి సారిస్తే మేలు..
జిల్లాలో ఇంటర్ ప్రవేశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా ఇంటర్మీడియట్ అధికారికి ప్రైవేట్ కళాశాలలపై ఉన్న దృష్టి ప్రైవేట్ కళాశాలలపై లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులే అధిక సంఖ్యలో ఫెయిలయ్యే పరిస్థితి నెలకొంది. అధికారులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

ప్రవేశాల పెంపునకు చర్యలు

> ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాల పెంపునకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ జూనియర్‌కళాశాలల్లో చేర్పించాలి. ప్రైవేట్‌తో పోల్చితే ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతుంది.
>
> –కృష్ణయ్య, డీఐఈవో, సూర్యాపేట

ఫలితాలు నామమాత్రమే..
ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల ఫలితాలు అంతంత మాత్రంగానే ఉండటంతో తల్లిదండ్రులు వీటిలో చేర్పించేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత సంవత్సరం ఫలితాల్లో ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 26.19శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 46.77 శాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో పాటు కొన్నేళ్లుగా విద్యార్థులను ఊరిస్తున్న మధ్యాహ్న భోజనం కలగానే మిగిలింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా పిల్లలను దూరం పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. అలాగే తల్లిదండ్రులు పిల్లలను ఒకేచోట ఉంచి చదివించడానికే ఆసక్తి చూపుతుండటంతో పదో తరగతి ముగియగానే గురుకులాలు, బాలికలైతే కస్తూరిబా విద్యాలయాల్లో ప్రవేశాల కోసం పరుగులు తీస్తున్నారు. వీటితో పాటు ప్రైవేట్ కళాశాలల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు.

యాదాద్రిలో నిత్యపూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం వంటి సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు జరిపించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు.

చిన్నారుల ఎదుగుదలకు..

- అంగన్‌వాడీల ద్వారా గ్రోత్ మేళా
- పోషణ లోపం గుర్తించి నివారించేందుకు ప్రత్యేక కార్యక్రమం
- 15వ తేదీతో ముగియనున్న మేళా



చిన్నారి బరువు నమోదు చేస్తున్న అధికారులు

హుజూర్‌నగర్ : నేటి బాలలే రేపటి భావిభారత పౌరులు. అందుకు బాల్యం నుంచే వారికి చక్కటి బాటలు వేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. వారు సరైన రీతిలో ఎదిగేందుకు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలబాలికల ఎదుగుదలను పర్యవేక్షిస్తున్నాయి. వారికి పౌష్టికాహారం అందించడంతో పాటు వివిధ సందర్భాల్లో పోషకాహార లోపాన్ని అధిగ మించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల అంగన్‌వాడీల ద్వారా గ్రోత్ మేళాకు శ్రీకారం చుట్టారు. ఆరేళ్లలోపు చిన్నారుల్లో పోషణ లోపాన్ని నిర్మూలించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపకరించనుంది.

పిల్లల ఎత్తు, బరువు నమోదు..
జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గత నెల 25 నుంచి గ్రోత్ మేళా కార్యక్రమం మొదలైంది. మహిళా శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో గ్రోత్ మేళాను చేపట్టారు. జిల్లాలోని 475 గ్రామ పంచాయతీలు, ఐదు మున్సిపాలిటీల పరిధిలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. దీనిలో వైద్య, డీఆర్‌డీఏ, పంచాయతీ రాజ్ శాఖలు భాగస్వాములు అవుతున్నాయి. గ్రామాలు, పట్టణాలల్లోని వార్డుల పరిధిలో రోజువారీగా గ్రోత్ మేళా నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని తల్లులను, పిల్లలను ఒక చోట చేర్చి పిల్లల ఎత్తు, బరువు కొలతలను నమోదు చేస్తున్నారు. వారు శాస్త్రీయంగా వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు ఉన్నారా, లేదా అనేది చూస్తున్నారు. తద్వారా పిల్లల పోషకాహార స్థాయిలను అక్కడికక్కడే వారి తల్లులకు వివరిస్తున్నారు.

పౌష్టికాహారం అందించాల్సిన తీరుపై..
పోషకాహార లోపంతో బాధపడే పిల్లలను గుర్తిస్తున్నారు. పిల్లలకు పౌష్టికా హారం అందించాల్సిన తీరును వారి తల్లులకు వివరిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా వారికి సలహాలు, సూచనలు చేస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులు హాజరవుతున్నారు. కార్యక్రమాన్ని జిల్లా అధికారులు సందర్శించి పర్యవేక్షిస్తున్నారు.

ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో..
జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఐదు ఉన్నాయి. వాటి పరిధిలో 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో గర్భిణులు 5,838 మంది, బాలింతలు 4,876 మంది ఉన్నారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 6 నెలల లోపు చిన్నారులు 4,980 మంది, 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 28,471 మంది ఉన్నారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 15,913 మంది ఉన్నారు. వారిలో అధికారుల లెక్కల ప్రకారం తీవ్ర పోషణ లోపంతో ఉన్న చిన్నారులు 1,147 మంది, అతితీవ్రపోషణ లోపంతో ఉన్న వారు 226 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిని సాధారణ స్థితికి తీసుకురావాలన్న లక్ష్యంలో అతి తీవ్ర పోషణ లోపం, తీవ పోషణ లోపంతో బాధపడే వారిని గుర్తిస్తున్నారు. ఆయావివరాలను పోషణ ట్రాకర్, ఎస్‌హెచ్‌టీఎస్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. అతి తీవ్ర పోషణ లోపం కలిగిన వారిని జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్‌సీ (న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్)కి తరలిస్తారు. అక్కడి వైద్యుల సహకారంతో పోషణ లోపాలను అధిగమించేందుకు తగిన చర్యలు చేపడతారు.

పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు..



> పిల్లల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు వివిధ దశల్లో చర్యలు తీసుకుంటున్నాం. ఈ క్రమంలో తీవ్ర పోషణ, అతి తీవ్ర పోషణ లోపాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటున్నాం. గ్రోత్ మేళాను ఈ నెల 15 వరకు పూర్తి చేస్తాం. అంతిమంగా పిల్లల్లో చక్కటి ఎదుగుదలకు కృషి చేస్తున్నాం.
>
> –వి. వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి, సూర్యాపేట

క్లుప్తంగా

గ్రామ పంచాయతీ ట్రాక్టర్ చోరీ

నార్కట్‌పల్లి: మండలంలోని ఏనుగులదోరి గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏనుగులదోరి గ్రామంలో చెత్త సేకరించేందుకు ఉపయోగించే గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను రోజు మాదిరిగా మంగళవారం రాత్రి గ్రాం పంచాయతీ కార్యాలయం సమీపంలోని నర్సరీ వద్ద సిబ్బంది పార్కింగ్ చేశారు. సిబ్బంది బుధవారం ఉదయం వెళ్లి చూసేసరికి ట్రాక్టర్ లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శికి విషయం తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఓ పెట్రోల్ బంక్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో డీజిల్ పోయించుకున్నట్లు గుర్తించారు. ఎంపీడీఓ ఉమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ

- ముగ్గురికి గాయాలు

చౌటుప్పల్: కారును లారీ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని రెడ్డిబావి గ్రామ శివారులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ చౌటుప్పల్ మండల పరిధిలోని రెడ్డిబావి గ్రామ శివారులోకి రాగానే అదుపుతప్పి డివైడర్ పైనుంచి అవతలి వైపు దూసుకెళ్లి హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. వారు చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకొని వెళ్లిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


మృతిచెందిన పాడి గేదెలు

భువనగిరి క్రైం: భువనగిరి మండలం వడాయిగూడెంలో బుధవారం విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతిచెందాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వడాయిగూడెం గ్రామానికి చెందిన పబ్బాల రమేష్ తండ్రి శివయ్య తన రెండు పాడి గేదెలను పొలంలో మేపుతుండగా.. కరెంట్ వైరుకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన గేదెల విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

మాల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో తనిఖీ

చింతపల్లి : మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎస్‌ఎస్‌సీ స్టేట్ బోర్డు డైరెక్టర్ కృష్ణారావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎన్నిక కావడంతో రూ.12.50 లక్షలు మంజూరు కాగా.. మూడు మూత్రశాలలు, స్లాబ్ మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాలలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పాఠశాలలో రికార్డులను తనిఖీ చేసి విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు.

తిరుమల తరహాలో భక్తులకు సదుపాయాలు

- యాదాద్రి కొండపై సులభ్ కాంప్లెక్స్ ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి
- అనంతరం భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్ష


ఆలయాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదగిరిగుట్ట: తిరుమల తరహాలో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు సదుపాయాలు కల్పించి, అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం ఆయన భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి యాదాద్రీశుడిని దర్శించుకొని, కొండపైన నూతనంగా నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఆలయాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తుల సమస్యలపై చర్చించారు. భక్తుల కోరిక మేరకు స్వామి వారిని సుమారు 20 మీటర్ల దూరం నుంచే చూసుకుంటూ వచ్చి దర్శనం చేసుకునేందుకు ర్యాంప్‌తో కూడిన క్యూలైన్ ప్రారంభించామన్నారు. నిత్యాన్నదాన సత్రంలో ప్రతిరోజు సుమారు 5వేల మంది భోజనం చేసే విధంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు స్వామి వారి శఠారి ఆశీర్వచనం ఇటీవలే కల్పించినట్లు పేర్కొన్నారు. కొండపైన ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నిషేధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో యాదర్షి, ప్రహ్లాద మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం శాశ్వత పార్కింగ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వీటితో పాటు యాదాద్రి కొండపై దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జన్మదిన వేడుకలు, వివాహ మహోత్సవం నిర్వహించుకునే భక్తులు అన్న ప్రసాదానికి దాతలుగా ముందుకు వచ్చి సహకరించాలని తెలిపారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నిధుల్లో భాగంగా ఆలేరు నియోజకవర్గానికి రూ.కోటి కేటాయించాలని కోరారు. అంతకుముందు ఆలయ పరిసరాలను పరిశీలించారు. స్వామి వారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యూలైన్ గుండా వెళ్తూ యాదాద్రీశుడి దర్శనం..


నూతన క్యూలైన్ వద్ద పూజలు చేస్తున్న బీర్ల ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదగిరిగుట్ట: తిరుమల తరహాలో క్యూలైన్ గుండా వెళ్తూ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వయంభూలను దర్శించుకునే సౌకర్యాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. భక్తులు మహా ముఖ మండపంలో మూలవరులను దర్శించుకుంటూ గర్భగుడి చెంతకు చేరేలా ప్రత్యేక లైన్‌తో పాటు ర్యాంప్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 15 నుంచి 20 మీటర్ల దూరం నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుంటూ, గర్భాలయ ద్వారం వద్దకు వెళ్తారు. గతంలో స్వామిని దర్శించుకునేందుకు రెండు క్యూలైన్లు ఉండగా.. ఇప్పుడు తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నట్లుగానే.. యాదాద్రీశుడిని దగ్గర నుంచి దర్శనం చేసుకుంటూ ముందుకు సాగనున్నారు. బ్రేక్ దర్శనం క్యూలైన్ పాత పద్ధతిలోనే కొనసాగనుంది. కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే పోలీసుల అదుపులో బిశ్వాల్

- టికెట్ లేకుండానే రైలులో ఎక్కిన నిందితుడు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రైల్వే పోలీసులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతిని స్వగ్రామానికి తీసుకెళ్లిన బంధువులు

మిర్యాలగూడ అర్బన్: రైలులో యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడు బిశ్వాల్‌ను నల్లగొండ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువతితో పాటు రైలు నుంచి కిందపడి గాయాలపాలైన బిశ్వాల్ మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం నల్లగొండ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో గాయపడిన శ్రీకాకుళం జిల్లాకు యువతి మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. మంగళవారం అర్ధరాత్రి ఆమె బంధువులు వచ్చి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసుకుని స్వగ్రామానికి తీసుకెళ్లారు. కాగా సదరు యువతి తన స్వగ్రామం వెళ్లేందుకు మంగళవారం విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు టికెట్ రిజర్వేషన్ చేసుకుని ఎస్–2 బోగిలో ఎక్కిందని, టికెట్ లేకుండానే ఎస్–2 బోగిలో ఎక్కిన బిశ్వాల్ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు మిర్యాలగూడ సమీపంలో ఆమెను ట్రైన్ నుంచి తోసేసేందుకు యత్నించి అతడు కూడా కిందపడిపోయినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న సమయంలో అతడు మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో భూమి నమోదు చేయడం లేదని..

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో భార్యాభర్తల ఆందోళన


పురుగుల మందు డబ్బాతో ధర్నా చేస్తున్న భార్యాభర్తలు

గుండాల: తాము కొనుగోలు చేసిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని గుండాల మండలం పెద్దపడిశాల గ్రామానికి చెందిన గొడ్డు మల్లమ్మ, ఆమె భర్త లింగయ్య పురుగు మందు డబ్బాతో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. పెద్దపడిశాల గ్రామానికే చెందిన మారోజు ఈశ్వరమ్మ వద్ద గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 277లో 25 గుంటల భూమిని 2004లో తాము కొనుగోలు చేశామని, ఆ భూమిని తమ పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పలుమార్లు అధికారులకు దరఖాస్తు చేసినా ఆర్ఎస్ఆర్ తక్కువగా ఉందని చూపుతూ నమోదు చేయడం లేదని ఆరోపించారు. సర్వే నంబర్లు 270, 271లో గ్రామానికి చెందిన కడారి కొమురమ్మకు 1.15 ఎకరాల భూమి ఉన్నప్పటికీ ఆమె భూమిని కూడా ఆర్ఎస్ఆర్ తక్కువగా ఉందని ఆన్‌లైన్‌లో ఎక్కించడం లేదని తెలిపారు. తమ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గతంలో పలుమార్లు జిల్లా కలెక్టర్, తహసీల్దార్‌ను కోరినప్పటికీ నమోదు చేయడం లేదన్నారు. భూమి సర్వే చేయించి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వరుసగా బైక్ చోరీలు


సీసీ కెమెరాలో రికార్డయిన బరాఖత్‌గూడెంలో బైక్ చోరీ చేసిన నిందితుడి దృశ్యాలు

మునగాల(కోదాడ): మండలంలోని పలు గ్రామాల్లో కొంతకాలంగా వరుసగా బైక్ దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 15రోజుల క్రితం మునగాల మండల కేంద్రంలోని గణపవరం క్రాస్‌రోడ్డులో ఓ ఎరువుల దుకాణం ముందు ఉంచిన బైక్ చోరీకి గురైంది. వారం క్రితం మండలంలోని బరాఖత్‌గూడెంలో సంగం కాంతారావుకు చెందిన టీవీఎస్ మోపెడ్‌ను గ్రామసెంటర్‌లో ఓ ఇంటిముందు పార్కింగ్ చేయగా పట్టపగలే చోరీ చేశారు. మంగళవారం అర్ధరాత్రి బరాఖత్‌గూడెంలో గరిడేపల్లి లక్ష్మణ్‌రావుకు చెందిన బైక్ చోరీకి గురైంది. ఈ దృశ్యాలు గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డయ్యింది. బైక్ చోరీ చేసిన నిందితుడు కోదాడ వైపు వెళ్లినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. అదేవిధంగా మండలంలోని ముకుందాపురంలో కుంచం రాజుకు చెందిన పల్సర్ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బైక్ చోరీలకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ముకుందాపురం, బరాఖత్‌గూడెం గ్రామాలకు చెందిన బైక్ యజమానులు కుంచం రాజు, గరిడేపల్లి లక్ష్మణ్‌రావు మునగాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- మరో ముగ్గురికి గాయాలు

చిట్యాల: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందాడు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగింది. చిట్యాల ఎస్‌ఐ–2 లింగయ్య బుధవారం తెలిపిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాగ్‌లోని సీతారాంపేటకు చెందిన రామనాథం సాయిరాం(28) తన స్నేహితులు సంప్రిత్ జోషి, చరణ్, వంశీ వినాయక్‌తో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లాడు. తిరిగి మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యలో చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులోకి రాగానే కారు అదుపుతప్పి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయిరాం పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్, రోటవేటర్‌ను అపహరించిన దొంగలు


చోరీకి గురైన ట్రాక్టర్ (ఫైల్)

భువనగిరి క్రైం: మండలంలోని నమాత్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జిట్టవారిగూడెంలో ట్రాక్టర్, రోటవేటర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీ చేశారు. జిట్టవారిగూడేనికి చెందిన జిట్టా రమేష్‌రెడ్డి తన వ్యవసాయ భూమిలో మంగళవారం తన సొంత ట్రాక్టర్‌తో దుక్కి దున్ని రాత్రి కావడంతో ట్రాక్టర్‌ను అక్కడే ఉంచి ఇంటికి వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున తిరిగి వెళ్లే సరికి ట్రాక్టర్, రోటవేటర్ కనిపించకపోయేసరికి భువనగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మధు (ఫైల్)

గరిడేపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతిచెందాడు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం తాడ్వాయి గ్రామానికి చెందిన నాగార్జునపు మధు (36) ఈ నెల 6వ తేదీన బైక్‌పై కోదాడ నుంచి మిర్యాలగూడ వెళ్తుండగా.. గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దొంగల భయంతో చెట్లు నరికివేత


పీఎన్‌ఆర్ టౌన్‌షిప్‌లో ఇళ్ల ముందు ఉన్న చెట్లను నరికివేసిన కాలనీవాసులు


రాత్రి పూట గస్తీ కాస్తున్న కాలనీవాసులు

- రాత్రివేళ స్వయంగా గస్తీకాస్తున్న పీఎన్‌ఆర్ టౌన్‌షిప్ వాసులు

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం కుడకుడ గ్రామ శివారులోని పీఎస్ఆర్ టౌన్‌షిప్‌లో గత కొద్దిరోజులుగా వరుస దొంగతనాలు జరుగుతుండడంతో కాలనీవాసులు ఇళ్ల ముందు చెట్లను నరికివేస్తున్నారు. దొంగలు రాత్రివేళ తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ ముసుగులు ధరించి దొంగతనాలకు పాల్పడుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. టౌన్‌షిప్‌లోని ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వాటికి చిక్కకుండా చెట్ల మాటున దాక్కోని చోరీలకు పాల్పడుతుండడంతో కాలనీవాసులు చేసేదేమీ లేక చెట్లను నరికివేస్తున్నారు. వరుస దొంగతనాలు జరుగుతున్నప్పటికీ పోలీసలు కనీసం పెట్రోలింగ్ చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇదే కాలనీలో పలువురు పోలీసు అధికారులు నివాసం ఉంటున్నప్పటికీ దొంగతనాలు జరుగుతుండడం గమనార్హం. రాత్రివేళ తామే స్వచ్ఛందంగా గస్తీ కాస్తున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు పెట్రోలింగ్ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయమై చివ్వెంల ఏఎస్‌ఐ రత్నంను వివరణ కోరగా.. ప్రతిరోజు రాత్రివేళ కుడకుడలోని జీఎంఆర్, పీఎంఆర్, స్నేహానగర్ కాలనీల్లో పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పలు ఇళ్లలో చోరీకి యత్నం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని కొమరబండలో గల కేఎల్ఆర్ కాలనీలో బుధవారం తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ చేశారు. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు తెల్లవారుజామున 4 గంటలకు కాలనీలోని పది ఇళ్లలో చోరీకి యత్నించారు. ఓ ఇంట్లో చార్జింగ్ పెట్టిన ఫోన్‌ను దొంగిలిస్తుండగా.. చప్పుడు కావడంతో దొంగలు పరారయ్యారు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బుధవారం ఉదయం కోదాడ రూరల్ సీఐ, ఎస్‌ఐలు రజితారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి కాలనీకి చేరుకుని విచారణ చేపట్టారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు

- గుంటూరు రైల్వే డీఆర్ఎం రామకృష్ణ

చిట్యాల: రైలు ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని గుంటూరు రైల్వే డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. బుధవారం చిట్యాల రైల్వే స్టేషన్, రైల్ ట్రాక్‌ను ఆయన పరిశీలించారు. ట్రాక్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా తక్షణమే అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఆయన వెంట రైల్వే అధికారులు అనూష, సుదర్శన్, శ్రీనివాస్, రామభద్రారావు, స్టేషన్ మాస్టర్ రాజు ఉన్నారు.

రైళ్లను ఆపాలని వినతి

చిట్యాల రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి, శబరి, జన్మభూమి, డెల్టా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని, ఉరుమడ్ల రోడ్డులో రైల్వేగేటు స్థానంలో ఫ్లైఓవర్‌ను నిర్మించాలని, జాతీయ రహదారి నుంచి రైల్వే స్టేషన్ వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వివిధ పార్టీల నాయకులు డీఆర్ఎం రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చికిలంమెట్ల అశోక్, గంధమల్ల రాములు, బొప్పని హరిబాబు, చెరుకూరి బాలకృష్ణ, నలావత్ కృష్ణా నాయక్, కాంగ్రెస్ నాయకులు దాసరి వెంకటేశ్వర్లు ఉన్నారు.


చిట్యాలలో రైల్వే ట్రాక్‌ను పరిశీలిస్తున్న రైల్వే డీఆర్ఎం రామకృష్ణ

13న విగ్రహాల ఆవిష్కరణ

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రంలోని బీసీ భవన్ వద్ద నెలకొల్పిన సావిత్రిబాయి పూలే, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 13న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు తెలిపారు. బుధవారం బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కాసోజు విశ్వనాథం, గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, కేశబోయిన శంకర్‌ముదిరాజ్, గుండా కోటప్ప, గోగికార్ శంకర్ పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మృతి

గరిడేపల్లి: మండల పరిధిలోని వెలిదండ గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు గడ్డం ఎలమంచమ్మ బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని సీపీఎం మండల నాయకులు యానాల సోమయ్య సందర్శించి నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో భిక్షం, కాశయ్య, వీరయ్య, బాషయ్య, సైదులు, వెంకన్న, సైదులు, రామారావు, దుర్గయ్య, సైదులు, రావులపెంట బ్రహ్మం, హుస్సేన్, ప్రసాద్, సుధాకర్ ఉన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్ ఎలమంచమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట సర్వారం సహకార సంఘం చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, బానోతు వెంకటేశ్వర్లు, పార్థసారథి, శంకర్ నాయక్, వీరస్వామి, బాలకృష్ణ పాల్గొన్నారు.

18.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- ముగ్గురు అరెస్ట్

హుజూర్‌నగర్ (చింతలపాలెం): అక్రమంగా తరలిస్తున్న, దాచిన 18.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చింతలపాలెం మండలంలో బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన జగన్నాథం శ్రీనివాసరావు చింతలపాలెం మండలం దొండపాడులో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ప్యాసింజర్ ఆటోలో ఎన్టీఆర్ కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం కునికిపాడుకి చెందిన బండారుపల్లి రామాంజనేయులుకు పంపుతుండగా.. చింతలపాలెం మండలం దొండపాడులోని బొమ్మల సెంటర్ దగ్గర మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. అదేవిధంగా ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన సాలే శశాంక్ కూడా మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు ఎన్టీఆర్ కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం కునికిపాడులోని రామాంజనేయులుకు చెందిన కోళ్ల ఫాంని సోదా చేయగా సుమారు 12.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కేసులు ఛేదించడంలో నిర్లక్ష్యం వహించొద్దు

- నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్


మునుగోడు: వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మునుగోడు: కేసులను ఛేదించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించొద్దని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోలీసులకు సూచించారు. బుధవారం మునుగోడు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కేసు నమోదు చేసిన వెంటనే ఛేదించి నిందితులను కోర్టులో హాజరుపరచాలన్నారు. యువతను తప్పుదోవ పట్టించే గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను నివారించాలని, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టి అక్రమ వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట చండూరు సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చండూరు: ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. చండూరు, గట్టుప్పల్ పోలీస్ స్టేషన్లను బుధవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం చండూరులో పోలీసులనుద్దేశించి మాట్లాడారు. క్రైమ్ రేటు తగ్గించాలని, ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో చండూర్ సీఐ వెంకటయ్య, నాంపల్లి సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐలు సురేష్, వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కనగల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

కనగల్ : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, రిసెప్షన్, లాకప్, పరిసరాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. ఎస్‌ఐ రామకృష్ణకు పలు సూచనలు చేశారు. పల్లెల్లో సీసీ కెమెరాలు అమర్చేవిధంగా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీకి ఎస్‌ఐ రామకృష్ణ మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపాడు. ఆయన వెంట చండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

మర్రిగూడ : ఎస్పీ శరత్‌చంద్రపవార్ బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్ఐ.రంగారెడ్డి ఎస్పీకి పూలమొక్క అందజేశారు. కార్యక్రమంలో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, సీఐ నవీన్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, సిబ్బంది నరేందర్, సత్యనారాయణ, యాదయ్య, హుస్సేన్, వాహీద్, రమేష్, సైదులు పాల్గొన్నారు.

నాంపల్లిలో..

నాంపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ శరత్‌చంద్రపవార్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ గిరిబాబు, సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ లచ్చిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

'ఐవీఓ' కృషి అభినందనీయం


జాతీయ జెండా నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మాజీ సైనికులు, నాయకులు

కోదాడరూరల్: ప్రజల్లో జాతీయభావం పెంపొందించేందుకు ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ (ఐవీఓ) చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు ప్రముఖులు అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని రామిరెడ్డిపాలెం రోడ్డులో ఐవీఓ జిల్లా అధ్యక్షుడు గుండా మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 100 అడుగుల జాతీయ జెండా నిర్మాణ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ చేసిన సైనికులు ఐవీఓ ద్వారా సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తుండడం ప్రశంసనీయమని అన్నారు. ప్రజలు, యువతలో జాతీయభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధవీరుడు గోపయ్యాచారి జయంతి సందర్భంగా కోదాడ పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు, పట్టణ ప్రముఖులను సన్మానించారు. కార్యక్రమంలో ఐవీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఉజ్జిని రవీందర్‌రావు, కేరళ రాష్ట్ర అధ్యక్షుడు దివాకర్, సౌత్‌జోన్ కోఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, పీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, పట్టణ సీఐ రాము, జగిని ప్రసాద్, గుండపనేని నాగేశ్వరరావు, వీరనారి శారద, రమేష్ తదితరులు ఉన్నారు.